

WWW.VIJAYAKERATAM.COM

RNI: APTEL/2010/34724

తెలుగు దినపత్రిక

విజయకెరటం

నిజం మా ధ్యేయం - ప్రజలే మా లక్ష్యం

VIJAYA KERATAM TELUGU DAILY



అక్టోబర్ 12 సోమవారం 2026 | సంపుటి : 18 | సంచిక : 249 | పేజీలు : 4 | వెల రూ. 1.00/- | ఎడిటర్ : యం.డి.మక్సూద్ అహ్మద్

MONDAY OCTOBER 12 2026 | VOL:18 | ISSUE: 249 | PAGES:4 | Rs. 1:00 | EDITOR:MD. MaKsood Ahmed

విజయవాడ ఉత్సవ్ 2.0: ఏపీ ప్రభుత్వానికి ప్రధాని మోదీ ప్రశంసల లేఖ


విజయవాడ ఉత్సవ్ 2.0 నిర్వహణపై ప్రధాని మోదీ హర్షం

ఏపీ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి అభినందనలు తెలుపుతూ లేఖ

దసరా ఉత్సవాలతో పాటు అక్టోబర్ 11 నుంచి వేడుకలు

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు చేతుల మీదుగా కార్యక్రమం ప్రారంభం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'విజయవాడ ఉత్సవ్ 2.0' కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ తన అభినందనలు తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి ఆయన ఒక లేఖ రాశారు. విజయవాడలో ఈ ఉత్సవాలను నిర్వహించడం పట్ల ప్రధాని హర్షం వ్యక్తం చేశారు.



హైదరాబాద్ డ్రగ్స్‌కు మూలం గోవానే: రేవంత్ సంచలన ఆరోపణ

గోవాలో రేవంత్ రెడ్డి పర్యటన

సీఎం ప్రమోద్ సావంత్ లక్ష్యంగా ఆరోపణలు

ఆయన ప్రమోద్ సావంత్ కాదు, ప్రాపర్టీ సావంత్ అని విమర్శ

హైదరాబాద్‌లో పట్టుబడిన డ్రగ్స్‌కు మూలం గోవానేనని ఆరోపణ

భూములను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని మండిపాటు

గోవాను కాపాడుకోవడానికి కాంగ్రెస్ అధికారంలోకి రావాలని పిలుపు



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గోవాలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గోవాను డ్రగ్స్‌కు అడ్డాగా మార్చారని, ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ కాదు, భూములు కబ్జా చేస్తున్న 'ప్రాపర్టీ సావంత్' అని ఆయన పదునైన విమర్శలు చేశారు. గోవాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన 'గోయ్ రాఖోన్'' (సేవ్ గోవా) యాత్రలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.బీజేపీ పాలనలో గోవా యువత నిరుద్యోగంతో నిరాశకు లోనవుతున్నారని, ప్రమాదకరమైన మాదకద్రవ్యాలకు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. "హైదరాబాద్‌లో పట్టుబడుతున్న డ్రగ్స్‌కు మూలాలు గోవాలోనే ఉన్నాయి. అక్కడి నుంచే దేశంలోని ప్రధాన నగరాలకు మాదకద్రవ్యాలు అక్రమంగా రవాణా అవుతున్నాయి" అని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. దిశా డైలీ కథనం ప్రకారం, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌లతో డ్రగ్స్ నెట్‌వర్క్‌లను కూల్చివేశామని, కానీ గోవా మాత్రం డ్రగ్స్‌కు ప్రధాన కేంద్రంగా మారిందని ఆయన తెలిపారు.గోవా సీఎం ప్రమోద్ సావంత్‌పై విమర్శలు కొనసాగిస్తూ, ఆయన భూములను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. గోవా అస్తిత్వాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని, బీజేపీ ప్రభుత్వం స్థానిక ప్రజల పట్ల తీవ్ర వివక్ష చూపుతోందని మండిపడ్డారు.రెండుసార్లు బీజేపీని నమ్మి గోవా ప్రజలు మోసపోయారని రేవంత్ అన్నారు. రాష్ట్ర భవిష్యత్తును, యువతను కాపాడుకోవాలంటే బీజేపీ అస్తవ్యస్త పాలనకు చరమగీతం పాడాలని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు.

ఢిల్లీలో బారికేడ్లు తొలగించండి, మెట్రో నడపండి.. ఇంటర్నెట్‌పై ఆంక్షలు వద్దు: సుప్రీంకోర్టు

ఢిల్లీలో అనవసర బారికేడ్ల తొలగింపునకు సుప్రీంకోర్టు ఆదేశం

ప్రజా ప్రయోజనాల దృష్ట్యా తప్ప మెట్రో, రైలు సేవలు ఆపవద్దని సూచన

నిరసనల వేళ ఆంక్షలపై దాఖలైన పిటిషన్లపై ప్రత్యేక విచారణ

ఇంటర్నెట్, మెట్రో సేవలు పునరుద్ధరించామని కోర్టుకు తెలిపిన కేంద్రం



ఎమర్జెన్సీ గురించి రాహుల్ ముందు నేర్చుకోవాలి: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

ఇప్పుడున్నది ఎమర్జెన్సీ కాదు, ముందు జాగ్రత్త చర్యలేనన్న కిషన్ రెడ్డి

బీజేపీ కార్యక్రమాలను రేవంత్ సర్కార్ అడ్డుకుంటోందని ఆరోపణ

దేశంలో అశాంతికి కొన్ని శక్తులు కుట్ర పన్నుతున్నాయని వ్యాఖ్య

(మిగతా 2వ పేజీలో..)



'ఓట్ల చోరీ'ని ఆపాలి.. రేపు సుప్రీంకోర్టు వరకు 'ఇండియా మార్చ్'.. భయపడకుండా రండి: రాహుల్ గాంధీ

ఎన్నికల ప్రక్రియపై సుప్రీంకోర్టుకు ఫిర్యాదు చేయనున్న విపక్షాలు

సోమవారం సుప్రీంకోర్టుకు మార్చ్ నిర్వహించాలని రాహుల్ గాంధీ పిలుపు

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు డిమాండ్

సీజేఐ అపాయింట్‌మెంట్ కోరుతూ లేఖ రాసినట్లు తెలిపిన ఖర్గే

శాంతియుత నిరసనకారులపై దాడులు జరిగాయని రాహుల్ ఆరోపణ



ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయని, 'ఓట్ల చోరీ' జరుగుతోందని ఆరోపిస్తున్న ప్రతిపక్షాలు తమ పోరాటాన్ని మరింత ఉద్ధృతం చేశాయి. ఈ అంశాలపై భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) దృష్టికి తీసుకెళ్లేందుకు సోమవారం సుప్రీంకోర్టుకు మార్చ్ నిర్వహించనున్నట్లు ప్రకటించాయి. ఈ మార్చ్‌లో ప్రజలందరూ పాల్గొనాలని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు.

(మిగతా 2వ పేజీలో..)

చెన్నైలో కొత్త మెట్రోకు పచ్చజెండా.. తొలి ప్రయాణం చేసిన ప్రధాని మోదీ, సీఎం విజయ్

చెన్నై మెట్రో ఫేజ్ 2లో కీలకమైన పూనమల్లి-వడపళని మార్గం ప్రారంభం

జెండా ఊపి రైలును ప్రారంభించి ప్రధాని మోదీ, సీఎం విజయ్

కొత్త మెట్రో రైలులో కలిసి ప్రయాణించిన ఇరువురు నేతలు

పశ్చిమ శివార్ల నుంచి నగర కేంద్రానికి తగ్గనున్న ప్రయాణ సమయం



చెన్నై మహానగరంలో రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా మరో కీలక ముందడుగు పడింది. చెన్నై మెట్రో రైల్ ఫేజ్ 2లో భాగంగా ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న పూనమల్లి-వడపళని మార్గాన్ని ప్రధాని నరేంద్ర మోదీ, తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ నేడు కలిసి ప్రారంభించారు. పోరూర్ బైపాస్ స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో ఇరువురు నేతలు జెండా ఊపి తొలి రైలు సర్వీసును ప్రారంభించారు. అనంతరం కొత్త మెట్రో రైలులో కలిసి ప్రయాణించి, అందులోని సౌకర్యాలను పరిశీలించారు. కారిడార్ 4లో భాగంగా సుమారు రూ.4,900 కోట్ల వ్యయంతో ఈ కొత్త మార్గాన్ని నిర్మించారు. 15 కిలోమీటర్ల పొడవున్న ఈ మార్గంలో మొత్తం 11 ఎలివేటెడ్ స్టేషన్లు ఉన్నాయి. ఈ ప్రాజెక్టులో

(మిగతా 2వ పేజీలో..)

సీఈసీ రాజీనామా డిమాండ్.. ఢిల్లీలో హైడ్రామా.. సీజేపీ నేతల విడుదల

ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా కోరుతూ సీజేపీ నిరసనకు పిలుపు

విమానంలోనే సీజేపీ నేతలను అదుపులోకి తీసుకున్న పోలీసులు

నిన్న అరెస్ట్ చేసిన ముగ్గురు నేతలను ఈరోజు విడుదల

నిరసనకు ముందు యూట్యూబర్ ధ్రువ్ రాఠీని కూడా అదుపులోకి తీసుకున్న పోలీసులు

ప్రయాణికులు వీడియోలు తీస్తుండగా విమానంలోనే నాటకీయ పరిణామాలు



(మిగతా 2వ పేజీలో..)

సీఈసీపై పోరు.. వాయిదా పడిన రాహుల్ గాంధీ గోవా పర్యటన!


సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా విపక్షాల నిరసనలు

ప్రస్తుతానికి వాయిదా పడిన గోవా పర్యటన

రాహుల్ పర్యటన వాయిదాపై గోవా కాంగ్రెస్‌లో భిన్నాభిప్రాయాలు

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తన గోవా పర్యటనను వాయిదా వేసుకునే అవకాశం ఉంది. కేంద్ర

(మిగతా 2వ పేజీలో..)



విజయకెరటం
తెలుగు దినపత్రిక

సం పా ద కీ యం

బతుకమ్మ ఔన్నత్యం.....

సంస్కృతికి సౌందర్యం.. సామాజిక మార్పుకు స్ఫూర్తి!

ప్రజా సంస్కృతి, మహిళా విముక్తి, సామాజిక సమానత్వం...

బతుకమ్మ అంటే కేవలం పూలను పేర్చి ఆడిపాడే పండుగ కాదు. బతుకమ్మ అంటే తెలంగాణ మట్టి పరిమళం. ప్రకృతితో మనిషికి ఉన్న అనుబంధం. మహిళల సామూహిక జీవితం. శ్రమజీవుల సంస్కృతి. తరతరాలుగా ప్రజలు తమ అనుభవాలను, భావోద్వేగాలను, ఆకాంక్షలను వ్యక్తం చేసుకుంటూ నిర్మించుకున్న ప్రజా సంప్రదాయం.అయితే బతుకమ్మ ఔన్నత్యాన్ని కేవలం పూల అందంలోనో, పండుగ వైభవంలోనో మాత్రమే చూడలేం. ఈ పండుగ వెనుక ఉన్న ప్రజా జీవన తత్వాన్ని, మహిళల శ్రమను, ప్రకృతి పరిరక్షణ సందేశాన్ని, సామాజిక సమానత్వ ఆకాంక్షను అర్థం చేసుకోవాలి. పండుగ రోజుల్లో మహిళలను గౌరవిస్తూ, మిగిలిన రోజుల్లో వారిపై వివక్ష చూపే సమాజంలో నిజమైన బతుకమ్మ స్ఫూర్తి వెల్లివిరియదు. పూలతో బతుకమ్మను పేర్చడం ఒక కళ. సమానత్వంతో సమాజాన్ని నిర్మించడం ఒక సామాజిక బాధ్యత. ఇదే బతుకమ్మ ఔన్నత్య

తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే బతుకమ్మ...

తెలంగాణ సంస్కృతి అనగానే మనకు గుర్తుకొచ్చే ప్రత్యేకమైన ప్రజా పండుగ బతుకమ్మ. ఆశ్వయుజ మాసంలో తొమ్మిది రోజులపాటు పూలతో బతుకమ్మలను పేర్చి, పాటలు పాడుతూ, ఆడిపాడుతూ మహిళలు ఈ పండుగను జరుపుకుంటారు. తంగేడు, గునుగు, బంతి, చామంతి వంటి స్థానిక పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలు తెలంగాణ పల్లెల్లో ప్రకృతి సౌందర్యాన్ని ప్రతిబింబిస్తాయి.బతుకమ్మలో కనిపించే అందం కేవలం పూల అమరికలో ఉండదు. పూలను సేకరించడంలో మహిళల శ్రమ ఉంటుంది. తరతరాలుగా ప్రజలు తమ జీవితంలోని సంతోషాలను, బాధలను, ఆకాంక్షలను పాటల రూపంలో వ్యక్తం చేశారు. ఆ పాటల్లో కుటుంబ సంబంధాలే కాదు, పేదరికం, అత్తింటి కష్టాలు, మహిళల ఆవేదనలు, పుట్టింటి అనుబంధం, ప్రకృతి సౌందర్యం వంటి అనేక అంశాలు ప్రతిఫలిస్తాయి. అందువల్ల బతుకమ్మ పాటలను ప్రజల సామాజిక చరిత్రలో ఒక భాగంగా చూడాలి.ప్రకృతితో సహజీవనాన్ని బోధించే పూల పండుగ మనిషి ప్రకృతికి అధిపతి కాదు. ప్రకృతిలో ఒక భాగం మాత్రమే. ఈ ప్రాథమిక సత్యాన్ని బతుకమ్మ తనదైన పద్ధతిలో గుర్తుచేస్తుంది. వర్షాకాలం ముగిసి, పల్లెల్లో పూలు విరబూసే కాలంలో బతుకమ్మ పండుగ వస్తుంది. ప్రకృతిలోని వివిధ రకాల పూలను సేకరించి బతుకమ్మగా పేర్చడం స్థానిక జీవవైవిధ్యాన్ని మన కళ్లముందు నిలుపుతుంది. ప్రకృతి ఇచ్చే సంపదను గుర్తించడం, ఋతువుల మార్పును ఆస్వాదించడం, చెరువులు, కుంటలతో అనుబంధాన్ని కొనసాగించడం ఈ పండుగలోని ముఖ్యమైన అంశాలు. కానీ నేడు మనం ఎదుర్కొంటున్న పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. పట్టణీకరణ పేరుతో చెరువులు కబ్జాలకు గురవుతున్నాయి. పారిశ్రామిక వ్యర్థాలు, మురుగునీరు జలవనరులను కలుషితం చేస్తున్నాయి. పల్లెల్లోనూ సహజ వనరులపై ఒత్తిడి పెరుగుతోంది.మన సమాజంలో మహిళలు కుటుంబ నిర్వహణ, వ్యవసాయ పనులు, కూలీ పనులు, పిల్లల సంరక్షణ, ఇంటి పనులు వంటి అనేక బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. వీరిలో చాలామంది తమ శ్రమకు తగిన గుర్తింపు, పారితోషికం పొందడం లేదు. కుటుంబం కోసం, సమాజం కోసం చేసే వారి శ్రమ తరచుగా కనిపించని శ్రమగానే మిగిలిపోతోంది.బతుకమ్మ సందర్భంగా మహిళలు ఒకచోట చేరి తమ అనుభవాలను పంచుకుంటారు. పాటల ద్వారా తమ భావాలను వ్యక్తం చేస్తారు. రోజువారీ జీవితంలోని ఒత్తిళ్ల నుంచి కొంత ఉపశమనం పొందుతారు. ఇది వారి సామాజిక సంబంధాలను బలోపేతం చేసే ప్రజా వేదికగా కూడా పనిచేస్తుంది.అయితే మహిళల గొప్పతనాన్ని పండుగ రోజుల్లో మాత్రమే కీర్తించి, మిగిలిన రోజుల్లో వారిపై వివక్ష కొనసాగించడం విరుద్ధమైన విషయం.మహిళల శ్రమకు గుర్తింపు లభించాలి. సమాన పనికి సమాన వేతనం అమలు కావాలి. మహిళలకు ఆస్తి హక్కులు, విద్యావకాశాలు, ఉపాధి అవకాశాలు కల్పించాలి. రాజకీయాల్లో, స్థానిక సంస్థల్లో, కార్మిక సంఘాల్లో, ప్రజా ఉద్యమాల్లో వారి భాగస్వామ్యం పెరగాలి. బతుకమ్మ వేడుకల్లో మహిళలను గౌరవించడం ఎంత ముఖ్యమో, వారి నిర్ణయాధికారాన్ని కుటుంబంలోనూ సమాజంలోనూ గౌరవించడం అంతే ముఖ్యం.మహిళల చేతుల్లో బతుకమ్మ ఉండాలి. అదే సమయంలో వారి చేతుల్లో తమ జీవితాలపై నిర్ణయాధికారం కూడా ఉండాలి. ఇదే బతుకమ్మకు సామాజిక మార్పు దృక్పథం అందించే నిజమైన గౌరవం.

బతుకమ్మ పాటల్లో ప్రజల జీవితం

ప్రజల సంస్కృతి అనేది రాజులు, పాలకులు, అధికార వర్గాల చరిత్ర మాత్రమే కాదు. సాధారణ ప్రజల జీవితాలు, కష్టాలు, ఆకాంక్షలు, అనుభవాలు కూడా సంస్కృతిలో అంతర్భాగమే.బతుకమ్మ పాటల్లో పల్లె జీవితం, వ్యవసాయ సంబంధాలు, కుటుంబ అనుబంధాలు, ప్రకృతి వర్ణనలు కనిపిస్తాయి. అనేక పాటల్లో మహిళల మనోభావాలు, వారి బాధలు, వారి ఆశలు వ్యక్తమవుతాయి. ఈ పాటలు పుస్తకాలలో రాయబడని సామాజిక అనుభవాలను ఒక తరం నుంచి మరో తరానికి అందిస్తాయి.ప్రజా పాటలను కేవలం వినోదంగా చూడకూడదు. అవి ప్రజల జీవన ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి ఉపయోగపడతాయి. అదే సమయంలో ప్రజల అనుభవాల నుంచి పుట్టిన సమానత్వ, సహజీవన, పరస్పర సహకార విలువలను ప్రోత్సహించాలి.ప్రజా సంస్కృతిని కాపాడటం అంటే దానిని మార్పులేని వస్తువుగా భద్రపరచడం కాదు. దానిలోని మానవీయ విలువలను నిలబెట్టి, వివక్షను పెంపొందించే అంశాలను విమర్శనాత్మకంగా అధిగమించడం.

కొత్త తరాలకు బతుకమ్మ ఇచ్చే సందేశం....

నేటి యువతరం వేగంగా మారుతున్న ప్రపంచంలో జీవిస్తోంది. సాంకేతిక పరిజ్ఞానం, పట్టణీకరణ, ఉద్యోగాల కోసం వలసలు, సామాజిక మాధ్యమాల ప్రభావం యువత జీవనశైలిని మార్చుతున్నాయి.ఈ మార్పుల మధ్య స్థానిక భాష, పాటలు, పూల పేర్లు, పల్లె సంప్రదాయాలు, చెరువులతో ఉన్న సంబంధం వంటి అంశాలు మరుగునపడే ప్రమాదం ఉంది.బతుకమ్మ పండుగ కొత్త తరాలకు తమ నేలను, భాషను, ప్రకృతిని, ప్రజల అనుభవాలను పరిచయం చేసే అవకాశం కల్పిస్తుంది.పిల్లలకు బతుకమ్మను నేర్పించేటప్పుడు పూల పేర్లు మాత్రమే కాకుండా వాటి పర్యావరణ ప్రాధాన్యాన్ని కూడా వివరించాలి. పాటలను నేర్పించేటప్పుడు వాటి వెనుక ఉన్న ప్రజల జీవన అనుభవాలను పరిచయం చేయాలి. పండుగను జరుపుకునేటప్పుడు చెరువులను శుభ్రంగా ఉంచడం, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం, స్థానిక మొక్కలను పెంచడం వంటి బాధ్యతలను కూడా నేర్పించాలి.అలాగే బాలికలకు విద్య, స్వేచ్ఛ, సమాన అవకాశాలు కల్పించడం కుటుంబాల బాధ్యతగా గుర్తించాలి. అబ్బాయిలకు మహిళల పట్ల గౌరవం, సమానత్వ భావన, ఇంటి పనుల్లో భాగస్వామ్యం వంటి విలువలను నేర్పించాలి.సంప్రదాయాన్ని తరువాతి తరాలకు అందించడమంటే పండుగను ఎలా జరుపుకోవాలో నేర్పించడమే కాదు. ఆ పండుగలోని మానవీయ విలువలను తమ జీవితాల్లో ఎలా ఆచరించాలో నేర్పించడం కూడా.

పూల వలయం నుంచి సమానత్వ సమాజం వైపు.....

బతుకమ్మ తెలంగాణ ప్రజల సాంస్కృతిక జీవనంలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న పండుగ. అది పూల సౌందర్యాన్ని, ప్రకృతి వైభవాన్ని, మహిళల సామూహిక జీవనాన్ని, ప్రాంతీయ అస్తిత్వాన్ని ప్రతిబింబిస్తుంది. తరతరాల ప్రజల అనుభవాలు, పాటలు, సృజనాత్మకత ఈ పండుగలో భాగమయ్యాయి.అయితే బతుకమ్మ ఔన్నత్యాన్ని కేవలం పూల అందంలోనో, వేడుకల వైభవంలోనో కొలవలేం. ఆ పండుగ మనకు ఎలాంటి సామాజిక విలువలను గుర్తుచేస్తోంది? ఆ విలువలను మనం ఎంతవరకు ఆచరిస్తున్నాం? అనే ప్రశ్నలకు సమాధానాలు వెతకాలి.మహిళలను గౌరవించే సమాజం కావాలి. కులవివక్ష లేని సమాజం కావాలి. శ్రమజీవులకు న్యాయం జరిగే సమాజం కావాలి. పేదరికం తగ్గి, విద్యా వైద్యం అందరికీ అందుబాటులో ఉండే సమాజం కావాలి. చెరువులు, కుంటలు, ప్రకృతి వనరులు పరిరక్షించబడే సమాజం కావాలి. మతం, కులం, ప్రాంతం పేరుతో ప్రజలను విడదీయకుండా మానవత్వం ఆధారంగా కలిసే సమాజం కావాలి.బతుకమ్మ పండుగలో పూలన్నీ వేర్వేరు రంగులు, రూపాలు కలిగి ఉన్నప్పటికీ ఒకే బతుకమ్మలో అందంగా కలిసిపోతాయి. అలాగే సమాజంలో భిన్నత్వాన్ని గౌరవిస్తూ, సమాన హక్కులతో ప్రజలందరూ జీవించే పరిస్థితులు ఏర్పడాలి.పూల వలయంలో కనిపించే ఐక్యత మన సామాజిక జీవితంలోనూ ప్రతిఫలించాలి. బతుకమ్మ పాటల్లో వినిపించే జీవన ఆకాంక్షలు వాస్తవ జీవితాల్లో సాకారం కావాలి. ప్రకృతిని ప్రేమించే మన భావన పర్యావరణ పరిరక్షణగా మారాలి. మహిళలను గౌరవించే మన సంప్రదాయం వారి హక్కులకు భరోసాగా నిలవాలి. ప్రజా సంస్కృతిపై మన గర్వం సామాజిక అన్యాయాలపై పోరాటానికి స్ఫూర్తినివ్వాలి.పూలను పేర్చడం ఒక కళ. ప్రజలను కలపడం ఒక సామాజిక బాధ్యత. ప్రకృతిని కాపాడటం మన కర్తవ్యం. వివక్షను నిర్మూలించడం మన పోరాటం. సమానత్వ సమాజాన్ని నిర్మించడం మన లక్ష్యం.ఈ నాలుగు లక్ష్యాలు కలిసినప్పుడే బతుకమ్మ పండుగ సౌందర్యం సామాజిక చైతన్యంగా రూపాంతరం చెందుతుంది.బతుకమ్మ బతుకుల పండుగగా నిలవాలి. ఆ బతుకులు గౌరవప్రదంగా, స్వేచ్ఛగా, సమానత్వంతో సాగాలి. తెలంగాణ సంస్కృతి ప్రజల ఐక్యతకు, ప్రకృతి పరిరక్షణకు, మహిళా విముక్తికి, సామాజిక మార్పుకు స్ఫూర్తినివ్వాలి.బతుకమ్మ బతకాలి.. ప్రజల సంస్కృతి బతకాలి.. మహిళా సమానత్వం వెల్లివిరియాలి.. కులవివక్ష అంతరించాలి.. ప్రకృతి పరిరక్షించబడాలి.. శ్రమజీవుల రాజ్యం, సమానత్వ సమాజ ఆకాంక్ష బలపడాలి!ఇదే బతుకమ్మ ఔన్నత్యానికి ప్రగతిశీల సామాజిక మార్పు దృక్పథం అందించే నూతన నిర్వచనం. బతుకమ్మ ఔన్నత్యం.....

వ్యాసకర్త:
మాలోతు సాగర్ సామాజిక వేత్త
సెల్ నెంబర్ 7013805411

విజయవాడే ఉత్సవ్ 2.0: ఏపీ ప్రభుత్వానికి ప్రధాని మోదీ ప్రశంసల లేఖ

మొదటి పేజీ తరువాయి)

ఆంధ్రప్రదేశ్ ఆర్థిక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక జీవనంలో విజయవాడకు ఒక ప్రత్యేక స్థానం ఉందని ప్రధాని తన లేఖలో పేర్కొన్నారు. ఈ ఉత్సవాలు పారిశ్రామికవేత్తలకు కొత్త అవకాశాలు కల్పిస్తాయని, పర్యాటక రంగానికి తాజా ఉత్తేజాన్ని ఇస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. విజయవాడ ప్రజలకు, వారి సాంస్కృతిక వారసత్వానికి మధ్య ఉన్న బంధాన్ని ఈ వేడుకలు మరింత బలోపేతం చేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంతో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు.దసరా ఉత్సవాలకు అనుగుణంగా ఇవాళ్టి (అక్టోబర్ 11) నుంచి విజయవాడ ఉత్సవ్ 2.0 వేడుకలు ప్రారంభం కానున్నాయి. నగరంలోని మకినేని బసవపున్నయ్య స్టేడియం, పున్నమి ఘాట్ సహా పలు ప్రాంతాలు ఈ ఉత్సవాలకు వేదికలుగా నిలవనున్నాయి. నగరం సాంస్కృతిక, ఆధ్యాత్మిక వారసత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పడంతో పాటు పర్యాటకాన్ని ప్రోత్సహించడం, స్థానిక ఆర్థిక అవకాశాలను మెరుగుపరచడం ఈ ఉత్సవాల ముఖ్య ఉద్దేశం. ఈ వేడుకలను కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రారంభించనున్నారు. ఈ ఉత్సవాలలో భాగంగా జాతీయ సరస్ మేళాను కూడా నిర్వహిస్తున్నారు. మహిళా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసే స్టాళ్లు ఈ మేళాలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఆధ్యాత్మిక పర్యాటకంపై దృష్టి పెట్టడంతో పాటు స్థానిక కళాకారులకు మద్దతు ఇవ్వడమే ఈ ఉత్సవాల ప్రధాన లక్ష్యమని ఎంపీ కేశినేని శివనాథ్ సహా నిర్వాహకులు చెబుతున్నారు. ప్రధాని నుంచి ప్రశంసలు రావడంతో ఈ కార్యక్రమంపై మరింత ఆసక్తి నెలకొంది.

సీఈసీ రాజీనామా డిమాండ్.. ఢిల్లీలో హైడ్రామా.. సీజేపీ నేతల విడుదల

మొదటి పేజీ తరువాయి)

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టేందుకు ఢిల్లీకి వచ్చిన 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) నేతలను పోలీసులు విడుదల చేశారు. నిన్న ఎయిర్ ఇండియా విమానంలో నాటకీయ పరిణామాల మధ్య అదుపులోకి తీసుకున్న అభిజీత్ దిప్కే సౌరవ్ దాస్, అశుతోష్ రాంకా ఈరోజు విడుదలయ్యారు. ఈ నిరసనకు ముందే గురుగ్రామ్‌లో అదుపులోకి తీసుకున్న ప్రముఖ యూట్యూబర్, ఇన్‌ఫ్లుయెన్సర్ ధ్రువ్ రాఠీని కూడా పోలీసులు తెల్లవారుజామున 3 గంటలకు విడిచిపెట్టారు.నిన్న ముంబై నుంచి ఢిల్లీకి వచ్చిన ఎయిర్ ఇండియా విమానం ల్యాండ్ అయిన కొద్ది నిమిషాలకే ఈ నాటకీయ ఘటన చోటుచేసుకుంది. వాణిజ్య విమానంలో ఇలాంటి దృశ్యాలు చాలా అరుదుగా కనిపిస్తాయి. విమానం టచ్‌డౌన్ అయిన వెంటనే, మహిళా సిబ్బందితో కూడిన ఢిల్లీ పోలీసుల బృందం విమానంలోకి ప్రవేశించి సీజేపీ నేతలు ముగ్గురినీ అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించింది. ఆ సమయంలో విమానంలోని తోటి ప్రయాణికులు ఆశ్చర్యపోయి, తమ మొబైల్ ఫోన్లలో ఈ దృశ్యాలను వీడియో తీశారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులతో అభిజీత్ దిప్కే వాగ్వాదానికి దిగారు. తాను అరెస్ట్ కావడానికే ఢిల్లీకి వచ్చానని ఆయన ఆగ్రహంతో అధికారులతో చెప్పడం వీడియోల్లో రికార్డయింది. అనంతరం ముగ్గురు నేతలను అదుపులోకి తీసుకున్న పోలీసులు, ఢిల్లీ కంటోన్మెంట్‌లోని అడిషనల్ సిటీ మేజిస్ట్రేట్ (ఏసీఎం) కోర్టులో హాజరుపరిచారు. కోర్టు ఆదేశాల మేరకు ఇవాళ వారిని విడుదల చేశారు. సీఈసీకి వ్యతిరేకంగా తలపెట్టిన నిరసనకు ముందే చోటుచేసుకున్న ఈ వరుస అరెస్టులు, విడుదలలు ఢిల్లీలో చర్చనీయాంశమయ్యాయి.

సీఈసీపై పోరు.. వాయిదా పడిన రాహుల్ గాంధీ గోవా పర్యటన!

మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా విపక్షాలు తలపెట్టిన ఆందోళనల్లో పాల్గొనేందుకు ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వర్గాల సమాచారం. వచ్చే వారం ఢిల్లీలో జరగనున్న ఈ నిరసన కార్యక్రమాల్లో ఆయన పాలుపంచుకోవాల్సి ఉన్నందున, గోవా పర్యటనను రీషెడ్యూల్ చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.ఎన్నికల ప్రక్రియలోని లోపాలు, ప్రజాస్వామ్య జవాబుదారీతనం వంటి అంశాలపై విపక్ష కూటమి ఈ ఆందోళనలకు పిలుపునిచ్చింది. ఈ కీలక సమయంలో రాహుల్ గాంధీ ఢిల్లీలోనే ఉండటం వల్ల విపక్షాల ఐక్యత బలపడుతుందని, పోరాటానికి మరింత ప్రాధాన్యం లభిస్తుందని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. ఇటీవలి కాలంలో పెద్దగా క్రియాశీలంగా లేని పలువురు విపక్ష నేతలు కూడా ఈ నిరసనల్లో పాల్గొంటారని అంచనా వేస్తున్నారు.వాస్తవానికి, 2027 గోవా అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఈ పర్యటనను ఖరారు చేశారు. పార్టీ కార్యకర్తలతో సమావేశం, ప్రజలతో మమేకం కావడం, సంస్థాగత బలోపేతం వంటి కార్యక్రమాలు చేపట్టాలని ప్రణాళిక రచించారు. అయితే, రాహుల్ పర్యటన వాయిదాపై గోవా కాంగ్రెస్ నేతల్లో మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. కొందరు నేతలు 'ఓట్ల చోరీ'కి వ్యతిరేకంగా జరుగుతున్న జాతీయ స్థాయి పోరాటానికే ప్రాధాన్యం ఇవ్వాలని అంటుండగా, మరికొందరు రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి రాహుల్ పర్యటన ఎంతో ముఖ్యమని అభిప్రాయపడుతున్నారు. ఢిల్లీలో నిరసనలు ముగిసిన తర్వాత గోవా పర్యటనకు సంబంధించిన కొత్త షెడ్యూల్‌ను ప్రకటించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

ఢిల్లీలో బారికేడ్లు తొలగించండి, మెట్రో నడపండి.. ఇంటర్నెట్‌పై ఆంక్షలు వద్దు: సుప్రీంకోర్టు

దేశ రాజధాని ఢిల్లీలో నిరసనల నేపథ్యంలో విధించిన కఠిన ఆంక్షలపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. శాంతిభద్రతలు లేదా ట్రాఫిక్ సమస్యలు ఉంటే తప్ప, మిగతా అన్ని చోట్లా ఏర్పాటు చేసిన బారికేడ్లను సమీక్షించి తొలగించాలని అధికారులను ఆదేశించింది. మెట్రో, రైల్వే సేవలను యథాతథంగా కొనసాగించాలని, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా అత్యవసరమైతే తప్ప వాటిని నిలిపివేయరాదని నేడు జరిగిన ప్రత్యేక విచారణలో స్పష్టం చేసింది.ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు సంబంధించిన డిమాండ్లతో నిన్న ఢిల్లీలో జరిగిన నిరసనల సందర్భంగా అధికారులు భారీ ఆంక్షలు విధించారు. పలు మెట్రో స్టేషన్లను మూసివేయడం, నిరసనకారులను అక్రమంగా అదుపులోకి తీసుకున్నారన్న ఆరోపణలపై సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లపై జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం ఆదివారం ప్రత్యేకంగా విచారణ చేపట్టింది.ఈ సందర్భంగా ధర్మాసనం పలు కీలకమైన మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. చట్టబద్ధమైన నిబంధనలకు లోబడి ప్రజలు, వాహనాల స్వేచ్ఛాయుత రాకపోకలకు అనుమతించాలని స్పష్టం చేసింది. చట్ట ప్రకారం కాకుండా ఇంటర్నెట్ సేవలకు ఎలాంటి అంతరాయం కలిగించరాదని తేల్చి చెప్పింది. నిర్దిష్ట ప్రాంతాల్లో ఆంక్షలు విధించిన చోట మినహా, శాంతియుతంగా సమావేశమయ్యే వారిని అక్రమంగా నిర్బంధించకూడదని ధర్మాసనం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది.విచారణ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం తన వాదనలు వినిపించింది. ఢిల్లీలో ఇంటర్నెట్ సేవలను ఇప్పటికే పునరుద్ధరించామని, మెట్రో కార్యకలాపాలు కూడా పూర్తిగా సాధారణ స్థితికి వచ్చాయని కోర్టుకు తెలియజేసింది. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, మెట్రో స్టేషన్ల మూసివేతపై వ్యక్తమైన ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని దీనిపై మరిన్ని వివరాలు సమర్పించాలని కోరుతూ తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది.

చెన్నైలో కొత్త మెట్రోకు పచ్చజెండా.. తొలి ప్రయాణం చేసిన ప్రధాని మోదీ, సీఎం విజయ్

అత్యాధునిక సాంకేతికతను వినియోగించారు. ముఖ్యంగా, కొన్నిచోట్ల డబుల్ డెక్కర్ సెక్షన్‌ను నిర్మించడం ఈ మార్గం ప్రత్యేకత. అంతేకాకుండా భవిష్యత్తులో డ్రైవర్ అవసరం లేకుండానే రైళ్లను నడిపేందుకు వీలుగా ఆధునిక సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఇది రైళ్ల రాకపోకలలో కచ్చితత్వాన్ని, భద్రతను పెంచుతుంది.ఈ కొత్త మెట్రో కారిడార్ అందుబాటులోకి రావడంతో చెన్నై పశ్చిమ శివారు ప్రాంతాలైన పూనమల్లి వంటి ఏరియాల నుంచి వడపళని వంటి నగర కేంద్ర ప్రాంతాలకు ప్రయాణం సులభతరం కానుంది. రోజూ ప్రయాణించే వేలాది మంది ఉద్యోగులు, విద్యార్థులు, సాధారణ ప్రజలకు ప్రయాణ సమయం గణనీయంగా ఆదా అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.ప్రారంభోత్సవ కార్యక్రమం ముగిసిన వెంటనే ఈ మార్గంలో ప్రయాణికుల కోసం సాధారణ సర్వీసులను కూడా ప్రారంభించారు. తమిళనాడు పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ పలు ఇతర మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను కూడా ప్రారంభించారు. ఈ కొత్త మెట్రో లైన్ చెన్నై నగర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని భావిస్తున్నారు.

ఎమర్జెన్సీ గురించి రాహుల్ ముందు నేర్చుకోవాలి: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి)

నిజమైన ఎమర్జెన్సీ అంటే ఏమిటో, ఆ సమయంలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడ్డారో రాహుల్ గాంధీ ముందుగా తెలుసుకోవాలని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి హితవు పలికారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్ష బీజేపీని ఎలా అణచివేస్తోందో స్వయంగా చూడటానికి రావాలని ఆయన రాహుల్‌ను ఆహ్వానించారు.ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం విధిస్తున్న ఆంక్షలను, 1975లో ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీతో విపక్షాలు పోల్చడంపై కిషన్ రెడ్డి స్పందించారు. ఇవి ఎమర్జెన్సీ కాదని, దేశంలో అశాంతి సృష్టించేందుకు కొన్ని దేశ వ్యతిరేక, అంతర్జాతీయ శక్తులు ప్రయత్నిస్తున్నాయని, అందుకే ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. విపక్షాలు లేనిపోని సమస్యలను సృష్టించి వ్యవస్థను దెబ్బతీయాలని చూస్తున్నాయని ఆయన ఆరోపించారు.ప్రజాస్వామ్యం పేరుతో కాంగ్రెస్ పార్టీ తమకు నీతులు చెప్పాల్సిన అవసరం లేదని కిషన్ రెడ్డి అన్నారు. "1975లో కాంగ్రెస్ వేలాది మందిని జైళ్లలో పెట్టింది, మీడియాపై నిషేధం విధించింది, పౌరుల హక్కులను కాలరాసింది" అని ఆయన గుర్తుచేశారు. తెలంగాణలో తాము శాంతియుతంగా కార్యక్రమాలు చేయాలన్నా హైకోర్టు అనుమతి తీసుకోవాల్సి వస్తోందని, ఇక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షాలపై ఎలాంటి ఆంక్షలు విధిస్తోందో రాహుల్ వచ్చి చూడాలని ఆయన అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పుట్టినరోజును పురస్కరించుకుని బీజేపీ దేశవ్యాప్తంగా నెల రోజుల పాటు 'సేవా సంకల్ప్ అభియాన్' నిర్వహిస్తోందని కిషన్ రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా ప్రజలకు సేవ చేయడం, వైద్య శిబిరాలు నిర్వహించడం, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించడం వంటివి చేపడుతున్నామని ఆయన వివరించారు.

'ఓట్ల చోరీ'ని ఆపాలి.. రేపు సుప్రీంకోర్టు వరకు 'ఇండియా మార్చ్'.. భయపడకుండా రండి: రాహుల్ గాంధీ

మొదటి పేజీ తరువాయి)

ఈ మేరకు ఆదివారం ఆయన ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. "ఓట్ల చోరీకి ముగింపు పలకాలని, ఎలక్టోరల్ రోల్స్, ఈవీఎంలకు సంబంధించిన ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలని, అలాగే ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దేశం తరపున సీజేఐ సూర్యకాంత్‌కు వినతిపత్రం సమర్పిస్తాం" అని రాహుల్ గాంధీ ఆ వీడియోలో తెలిపారు. "భయపడొద్దు. ప్రేమ, సోదరభావం, దేశభక్తితో కలిసి నడుద్దాం. రేపు యావత్ భారతదేశం సుప్రీంకోర్టుకు కదులుతుంది" అని ఆయన అన్నారు.మరోవైపు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించారు. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా దేశంలో గందరగోళం, భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. సీజేఐ అపాయింట్‌మెంట్ కోరుతూ తాను, రాహుల్ గాంధీ లేఖలు రాసినట్లు ఖర్గే వెల్లడించారు. సోమవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య సమయం కోరినట్లు తెలిపారు.శనివారం ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలిపిన యువతపై పోలీసులు, బీజేపీ గూండాలు దాడి చేశారని రాహుల్ గాంధీ ఆరోపించారు. నరేంద్ర మోదీ, అమిత్ షా, అజిత్ దోవల్, మోహన్ భగవత్ వంటి వారు భారత ప్రజల గొంతు నొక్కలేరని, వారి పిరికిపంద చర్యలకు భయపడేది లేదని రాహుల్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ మార్చ్‌లో యువత, ప్రతిపక్ష పార్టీలు, పౌర సమాజ బృందాలు, ప్రజాస్వామ్యాన్ని విశ్వసించే ప్రతి ఒక్కరూ పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

విజయ కెరటం
తెలుగు దినపత్రిక
అక్టోబర్ | సోమవారం | 12 | 2026

2028 జూన్ నాటికి శ్రీశైలం సొరంగ మార్గం పూర్తి చేస్తాం

నల్లగొండ జిల్లాలో ప్రతి గ్రామానికి డబుల్ రోడ్డు.. గుడిసెలు లేని తెలంగాణే లక్ష్యం

నల్లగొండ, అక్టోబర్ 11 (విజయ కెరటం):

2028 జూన్ నాటికి శ్రీశైలం సొరంగ మార్గం పనులను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించడమే తన జీవిత లక్ష్యమని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లాలోని ప్రతి గ్రామానికి డబుల్ రోడ్డు సౌకర్యం కల్పిస్తామని, గుడిసెలు లేని తెలంగాణ నిర్మించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఆదివారం నల్లగొండ జిల్లాలో రూ. 74 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న రోడ్ల విస్తరణ, పటిష్టీకరణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. కనగల్ మండలం తెలకంటిగూడెం నుంచి తొరగల్లు, జంగమాయిగూడెం మీదుగా ముషంపల్లి వరకు రూ. 41 కోట్లతో చేపట్టనున్న రోడ్డు పనులకు తెలకంటిగూడెం వద్ద శంకుస్థాపన చేశారు. అలాగే నల్లగొండ--నిడమనూరు రహదారి నుంచి చెట్లచెన్నారం, చిన్నమాదారం, తంగెళ్లవారిగూడెం మీదుగా ముషంపల్లి వరకు రూ. 33 కోట్లతో చేపట్టనున్న రోడ్డు విస్తరణ, పటిష్టీకరణ పనులకు శేరిలింగోటం వద్ద శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో రూ. 1,600 కోట్లతో రహదారుల అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. రూ. 900 కోట్లతో నల్లగొండ ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. రహదారులు మెరుగుపడితే పరిశ్రమలు, రైస్ మిల్లుల ఏర్పాటుకు అవకాశాలు పెరుగుతాయని, రవాణా సౌకర్యాలు మెరుగై యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. భూముల విలువ కూడా పెరుగుతుందని, జిల్లాలోని ప్రతి గూడెం, గ్రామానికి డబుల్ రోడ్డు సౌకర్యం కల్పిస్తామని స్పష్టం చేశారు.



అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

గుడిసెలు లేని తెలంగాణ నిర్మాణంలో భాగంగా తెలకంటిగూడెంలో ఇప్పటికే 107 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. గ్రామంలో ఇంకా ఇళ్లు మంజూరు కాని అర్హులైన కుటుంబాలకు కూడా ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఎల్-1, ఎల్-3 విభాగాల్లో సాంకేతిక సమస్యలు ఉన్నప్పటికీ అర్హులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇళ్ల పట్టాలు లేని వడ్డెర కులస్తులకు పట్టాలు అందించినట్లు వెల్లడించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రేషన్ కార్డులు, ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ, స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు రూ. 2 లక్షల వరకు పంట రుణమాఫీ వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు వివరించారు. బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలకు చీలకపచ్చ రంగు చీరలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

నీటిని పొదుపుగా వినియోగించుకోవాలి

ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గి కరువు పరిస్థితులు ఏర్పడే



అవకాశం ఉన్నందున ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని మంత్రి సూచించారు. తాగునీటిని వృథా చేయకుండా కాపాడుకోవాలని, పంటలను రక్షించుకునేందుకు రైతులు నీటి వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని కోరారు. నాగార్జునసాగర్‌లో నీటి నిల్వలు తక్కువగా ఉన్నప్పటికీ పరిసర గ్రామాల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని చెరువులను నింపేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. శ్రీశైలం సొరంగ మార్గం పూర్తయితే రైతులకు రెండు పంటలకు సాగునీరు అందించే అవకాశం ఉంటుందని చెప్పారు. నిర్దిష్ట గడువులో పనులు పూర్తి చేసి ప్రతి ఎకరాకు నీరు అందించాలన్నదే తన సంకల్పమని పేర్కొన్నారు. రైతులు సంతోషంగా ఉండాలని, పేదల ముఖాల్లో చిరునవ్వులు చూడాలన్నదే తన ఆకాంక్ష అని మంత్రి తెలిపారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్‌తో పాటు ఆర్‌అండ్‌బీ ఎస్ఈ మోహన్, ఆర్డీఓ వై. అశోక్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రీధర్‌రెడ్డి, కనగల్ తహసీల్దార్ పద్మ, ఎంపీడీఓ వేద రక్షిత, మాజీ జెడ్పీటీసీ గుమ్మల మోహన్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

2028 జూన్ నాటికి ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం పూర్తి చేయడమే లక్ష్యం

సొరంగ మార్గంతో ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం -- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్గొండ, అక్టోబర్ 11 (విజయ కెరటం):

శ్రీశైలం సొరంగ మార్గం పూర్తయితే నల్గొండ జిల్లా ప్రజలకు తాగునీటి సమస్య నుంచి ఉపశమనం లభించడంతో పాటు రైతులకు సాగునీటి భద్రత చేకూరుతుందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం పూర్తితో జిల్లాలో ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. ఆదివారం నల్గొండ జిల్లా కనగల్ మండలంలో సుమారు రూ. 74 కోట్ల వ్యయంతో చేపట్టనున్న రహదారి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా షేరిలింగోటం వద్ద మీడియాతో మాట్లాడుతూ.. 2028 జూన్ నాటికి ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గాన్ని పూర్తి చేసి రైతులకు రెండు పంటలకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించడమే తన జీవిత లక్ష్యమని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం పనులను ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తిరిగి ప్రారంభించామని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



సహకారంతో పనులు కొనసాగుతున్నాయని, ఇప్పటివరకు సుమారు 800 మీటర్ల మేర పనులు పూర్తయ్యాయని వెల్లడించారు. సొరంగ మార్గం పూర్తయితే దేవరకొండ, మునుగోడు ప్రాంతాలకు సాగునీరు అందడంతో పాటు నల్గొండ నియోజకవర్గంలో సుమారు 2.30 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని వివరించారు. గంధమల్ల, బస్వాపురం ప్రాజెక్టుల పనులను కూడా వేగవంతం చేస్తామని తెలిపారు. రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం రాష్ట్రంలో రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ రహదారులను దేశానికే ఆదర్శంగా



తీర్చిదిద్దుతామని చెప్పారు. హైదరాబాద్--విజయవాడ జాతీయ రహదారి అభివృద్ధికి రూ. 12 వేల కోట్ల నిధులు మంజూరు చేయించామని తెలిపారు. జాతీయ రహదారులపై గుర్తించిన 17 ప్రమాదకర ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని, వచ్చే సంక్రాంతి నాటికి వాటిని పూర్తి చేస్తామని వెల్లడించారు. యాదాద్రి--భువనగిరి రహదారి పనులను నవంబర్ నాటికి పూర్తి చేస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, ఆర్డీవో వై. అశోక్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు

భారత్--జపాన్ స్నేహబంధం మరింత బలోపేతం కావాలి

హైదరాబాద్ జపాన్ ఫెస్టివల్--2026ను ప్రారంభించిన శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 11 (విజయ కెరటం):

భారత్, జపాన్ దేశాల మధ్య స్నేహపూర్వక సంబంధాలు మరింత బలోపేతం కావాలని తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆకాంక్షించారు. హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలో ఉన్న సైబర్ గార్డెన్స్‌లో ఆదివారం నిర్వహించిన హైదరాబాద్ జపాన్ ఫెస్టివల్--2026ను ఆయన ప్రారంభించారు. హైదరాబాద్, జపాన్‌లోని మియోషి నగరాల మధ్య సిస్టర్ సిటీ భాగస్వామ్యం ఏర్పడి 20 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదర్శనశాలలను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన గుత్తా సుఖేందర్ రెడ్డి, జపాన్ సంస్కృతి, కళలు, సాంకేతికత, సంప్రదాయాలను ప్రతిబింబించే స్టాళ్లను సందర్శించారు. జపాన్ ప్రతినిధులతో మాట్లాడి ప్రదర్శనల విశేషాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత్, జపాన్ దేశాల మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న స్నేహపూర్వక సంబంధాలు ప్రపంచ దేశాలకు



ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. హైదరాబాద్, మియోషి నగరాల మధ్య సిస్టర్ సిటీ భాగస్వామ్యం రెండు దశాబ్దాలు పూర్తి చేసుకోవడం సంతోషకరమన్నారు. ఇలాంటి అంతర్జాతీయ సాంస్కృతిక కార్యక్రమాలు ఇరు దేశాల ప్రజల మధ్య స్నేహభావాన్ని పెంపొందించడంతో పాటు విద్య, సాంకేతికత, పరిశ్రమలు, పర్యాటక రంగాల్లో పరస్పర సహకారానికి దోహదపడతాయని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం, క్రమశిక్షణ, పారిశ్రామిక అభివృద్ధిలో జపాన్ ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తోందని కొనియాడారు. తెలంగాణ రాష్ట్రం కూడా ఐటీ, ఫార్మా, పరిశ్రమలు,



ఆవిష్కరణల రంగాల్లో అంతర్జాతీయ గుర్తింపు పొందుతోందని అన్నారు. తెలంగాణ, జపాన్ మధ్య విద్యా, పారిశ్రామిక, సాంకేతిక రంగాల్లో మరిన్ని భాగస్వామ్యాలు ఏర్పడాలని ఆకాంక్షించారు. విభిన్న సంస్కృతులు, సంప్రదాయాలు కలిగిన దేశాల మధ్య స్నేహ సంబంధాలను బలోపేతం చేయడంలో ఇలాంటి ఉత్సవాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జపాన్ కాన్సుల్ జనరల్ మునియో తకాహోషి, మియోషి నగర డిప్యూటీ మేయర్ తెరుమో యమజాకి, జపాన్‌కు చెందిన ప్రముఖ ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

మునుగోడు ప్రజల తాగు, సాగునీటి అవసరాలపై రాజీ పడే ప్రసక్తే లేదు

డిండి ఎత్తిపోతల పథకంపై విశ్రాంత ఇంజనీర్లతో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి సమీక్ష

హైదరాబాద్ (విజయ కెరటం):

ఫ్లోరైడ్ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న మునుగోడు నియోజకవర్గ ప్రజల తాగునీరు, సాగునీటి అవసరాలను తీర్చే విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడే ప్రసక్తే లేదని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. డిండి ఎత్తిపోతల పథకానికి నీటిని తరలించడం, లక్ష్మణాపురం, శివన్నగూడెం రిజర్వాయర్లకు సంబంధించిన పనులపై హైదరాబాద్‌లోని తన నివాసంలో తెలంగాణ విశ్రాంత ఇంజనీర్ల సంఘం ప్రతినిధులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా చేపట్టిన డిండి ఎత్తిపోతల పథకంతో పాటు మునుగోడు నియోజకవర్గంలోని లక్ష్మణాపురం, శివన్నగూడెం రిజర్వాయర్లకు నీటిని ఎక్కడి నుంచి తరలించాలనే అంశంపై గత ప్రభుత్వం స్పష్టమైన చర్యలు





తీసుకోలేదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తన చొరవతో ఏడుల రిజర్వాయర్ నుంచి నీటిని తరలించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ పనులకు సంబంధించి ప్రభుత్వం రూ. 1,800 కోట్లు మంజూరు చేసిందని వెల్లడించారు. ఏడుల రిజర్వాయర్ నుంచి నీటి తరలింపు పనులతో పాటు లక్ష్మణాపురం, శివన్నగూడెం ప్రాజెక్టుల పరిధిలోని హెడ్‌వర్క్స్, భూసేకరణ తదితర పనులను పూర్తి చేసేందుకు ప్రభుత్వంతో మాట్లాడతానని విశ్రాంత ఇంజనీర్ల సంఘం ప్రతినిధులకు హామీ ఇచ్చారు. నీటి తరలింపు అంశంపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో మునుగోడు ప్రజలకు తాగునీరు, రైతులకు సాగునీరు అందించడమే ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ విశ్రాంత ఇంజనీర్ల సంఘం అధ్యక్షుడు మేరెడ్డి శ్యాంప్రసాద్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి తన్నీరు వెంకటేశం, సలహాదారులు వి.వెంకటరామారావు, ఎం.సత్తిరెడ్డి, ఇంద్రసేనారెడ్డి, జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

తిప్పర్తిలో అహింసా మహా కరుణ శాకాహార ర్యాలీ

వీధివీధినా శాకాహార విశిష్టతపై అవగాహన

తిప్పర్తి, అక్టోబర్ 11 (విజయ కెరటం):



నల్గొండ పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ, తిప్పర్తి పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం తిప్పర్తి మేజర్ గ్రామ పంచాయతీలో 'అహింసా మహా కరుణ శాకాహార ర్యాలీ' నిర్వహించారు. గుండ న రోజనమ్మ, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి నలపరాజు శ్రీనివాస్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. మిర్యాలగూడ, కోదాడ, చండూరు, నకిరేకల్లు, సూర్యాపేట తదితర ప్రాంతాల నుంచి వచ్చిన పిరమిడ్ మాస్టర్లు గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. శాకాహారం వల్ల కలిగే ఆరోగ్య, మానసిక, ఆధ్యాత్మిక ప్రయోజనాలను వివరిస్తూ ప్రజల్లో అవగాహన కల్పించారు. అహింస, కరుణ, శాకాహార జీవన విధానం ప్రాముఖ్యతను చాటిచెప్పారు. జీవనవనం పిరమిడ్ ధ్యానక్షేత్రం, మమ్ముదాపురానికి చెందిన గరికపాటి సుబ్రహ్మణ్యం సారథ్యంలో, సాగర్‌కు చెందిన దొన్నాదుల సతీష్ బాబు ఆధ్వర్యంలో కార్యక్రమం కొనసాగింది. ర్యాలీ అనంతరం స్థానిక కృషి ఫంక్షన్ హాల్‌లో ముగింపు సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నల్గొండ జిల్లా పీఎస్ఎస్ఎం గౌరవాధ్యక్షుడు భూసాని జగదీశ్వర్ రెడ్డి, భూసాని కృష్ణారెడ్డి, జిన్నాముల సంతోష్ బాబు, డాక్టర్ శివకుమార్, నాగరాజు, మల్లేశం, అరవింద్ రెడ్డి, కర్నాటి లింగారెడ్డి, శరత్ బాబు, వాసు, అల్లాని సేన, ధనమ్మ, సువర్ణ, శ్రీను, అనంతల సత్యనారాయణ, సీనియర్ పిరమిడ్ మాస్టర్ మంచుకొండ నాగరాజు, వాసవి క్లబ్ సభ్యులు శ్రీనివాస్, బ్రహ్మదేవర అశోక్ తదితరులు పాల్గొన్నారు. మిర్యాలగూడ పీఎస్ఎస్ఎం తరపున కర్నాటి రాంబాబు, డాక్టర్ అంజయ్య, వాసుదేవరావు, శ్రీలలితతో పాటు పలువురు పిరమిడ్ మాస్టర్లు పాల్గొని ర్యాలీ విజయవంతానికి సహకరించారు. ఈ సందర్భంగా 'జై శాకాహార జగత్', 'జై పిరమిడ్ జగత్', 'జై ధ్యాన జగత్' నినాదాలతో శాకాహారం, ధ్యానం ప్రాముఖ్యతను చాటిచెప్పారు.

మూఢనమ్మకాలపై చట్టం తేవాలి

కన్నతల్లి హత్య అమానవీయం: ఎస్ఎస్ఎఫ్ డిమాండ్

వరంగల్ విజయ కెరటం, 11 అక్టోబర్ :



మంత్రాల నెపంతో కన్నతల్లిని కుమారుడే హత్య చేయడం అత్యంత అమానవీయమని సైంటిఫిక్ స్టడీ ఫోరం (ఎస్ఎస్ఎఫ్) రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు పెండ్యాల సుమన్ ఆవేదన వ్యక్తం చేశారు. మూఢనమ్మకాల కారణంగా అమాయకులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ఎస్ఎస్ఎఫ్ కార్యాలయంలో ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, మెదక్ జిల్లా టేక్మాల్ మండలం ఎల్లుపేట గ్రామంలో మంత్రాలు చేస్తున్నారనే నెపంతో కన్నతల్లిని హత్య చేసిన ఘటనను ఖండించారు. మూఢనమ్మకాల పేరుతో ప్రజలు ప్రాణాలు, ఆస్తులు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే మూఢనమ్మకాల నిర్మూలనకు ప్రత్యేక చట్టాన్ని రూపొందించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేలా పాఠ్యాంశాలను రూపొందించాలని, గ్రామీణ ప్రాంతాల్లో మూఢనమ్మకాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ప్రజల్లో శాస్త్రీయ ఆలోచనా విధానం పెంపొందించినప్పుడే ఇలాంటి అమానవీయ ఘటనలను అరికట్టగలమని పెండ్యాల సుమన్ స్పష్టం చేశారు.

అనాథాశ్రమంలో అశోక్ యాదవ్ జన్మదిన వేడుకలు

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ.. అన్నదానం

వరంగల్,విజయ కెరటం, 11 అక్టోబర్:



తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొమ్ము అశోక్ యాదవ్ జన్మదిన వేడుకలను మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కల్వరి అనాథాశ్రమంలో జిల్లా అధ్యక్షుడు చిల్లరపు సంతోష్ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదానం చేసి, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంతోష్ యాదవ్ మాట్లాడుతూ, గొల్లకురుమల సమస్యల పరిష్కారానికి, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి అశోక్ యాదవ్ నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. కరోనా సమయంలోనూ నిరుపేదలకు సేవలందించారని పేర్కొన్నారు. అనంతరం డాక్టర్ కొమ్ము అశోక్ యాదవ్ మాట్లాడుతూ, తన జన్మదిన వేడుకలను నిర్వహించిన జిల్లా అధ్యక్షుడు, నాయకులు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. నిరుపేదల సమస్యల పరిష్కారానికి, ప్రజాసేవకు చివరి శ్వాస వరకు అంకితమవుతానని అన్నారు. ఈ కార్యక్రమంలో అల్లముల సదానందం యాదవ్, కేశవేణి సత్యనారాయణ యాదవ్, సందనవేణి మల్లేష్ యాదవ్, అల్లాముల మహేష్ యాదవ్, నవీన్ యాదవ్, కల్వరి ఆశ్రమం డైరెక్టర్ కుమార్, దాడి రాజబాబు, జాగటి సమ్మయ్య, రాజన్న యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పరకాలలో వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

శ్రీ బాలా త్రిపురసుందరీ దేవిగా అమ్మవారి అలంకరణ



వరంగల్ విజయకెరటం,11 అక్టోబర్:



శరన్నవరాత్రి ఉత్సవాలను లోకకల్యాణం, విశ్వశాంతిని ఆకాంక్షిస్తూ నిర్వహిస్తున్నామని ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు కొలుగూరి రాజేశ్వరరావు అన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు. హనుమకొండ జిల్లా పరకాల పట్టణంలోని శ్రీ కుంకుమేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఈ నెల 11 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించే ఉత్సవాలను ఆచార్యులు బ్రహ్మశ్రీ కొమళ్లపల్లి సంపత్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో శైవాగమ సంప్రదాయం ప్రకారం నిర్వహిస్తున్నారు. తొలిరోజు విఘ్నేశ్వర పూజ, దీక్షాధారణ, అఖండ దీపస్థాపన, ధ్వజారోహణం, నవావరణ పూజలు, హోమాలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారిని శైలపుత్రి రూపంలో శ్రీ బాలా త్రిపురసుందరీ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం బ్రహ్మచారిణి రూపంలో శ్రీ గాయత్రీ దేవిగా అలంకరించనున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని భవానీ దీక్షలు స్వీకరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు డాక్టర్ రంగు సరోజన సత్యనారాయణ, శ్రీధర్, రవి, సావులారం, సంధ్య సత్యనారాయణ, నవీన్, వంశపారంపర్య అర్చకులు కొమళ్లపల్లి నాగభూషణ శర్మ, కార్యనిర్వహణాధికారి అద్దెంకి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విజయకెరటం
తెలుగు దినపత్రిక

సమాచార హక్కు చట్టం అమలులో నల్గొండ కలెక్టర్‌కు రాష్ట్రస్థాయి అవార్డు

కలెక్టర్ బి. చంద్రశేఖర్‌ను సత్కరించిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

నల్గొండ, అక్టోబర్ 11 (విజయ కెరటం):



సమాచార హక్కు చట్టాన్ని నల్గొండ జిల్లాలో సమర్థవంతంగా అమలు చేస్తూ, పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించడంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్‌ను రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అభినందించారు.సమాచార హక్కు చట్టం 4(1)(బి) కింద స్వచ్ఛందంగా సమాచారాన్ని వెల్లడించడంలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు ఇటీవల రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల చేతుల మీదుగా రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్న కలెక్టర్ చంద్రశేఖర్‌ను ఆదివారం నల్గొండలోని ఇందిరా భవన్ వద్ద మంత్రి శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు.సమాచార హక్కు చట్టాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేసి నల్గొండ జిల్లాకు మంచి పేరు తీసుకువచ్చినందుకు కలెక్టర్‌ను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వ పాలనలో పారదర్శకత, ప్రజలకు సమాచారం అందుబాటులో ఉంచడంలో కలెక్టర్ చూపిన చొరవ ప్రశంసనీయమని కొనియాడారు.

నాగార్జునసాగర్‌లో జర్నలిస్టులకు ఏఐ, సోషల్ మీడియాపై వర్క్‌షాప్

నాగార్జునసాగర్, అక్టోబర్ 11 (విజయ కెరటం):

నాగార్జునసాగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆడిటోరియంలో సోమవారం (అక్టోబర్ 12) జర్నలిస్టుల కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), సోషల్ మీడియాపై ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ వర్క్‌షాప్‌లో నాగార్జునసాగర్ పరిసర ప్రాంతాల జర్నలిస్టులు పాల్గొననున్నారు. ఉదయం 9.30 గంటలకు మీడియా అకాడమీ చైర్మన్ నాగార్జునసాగర్ చేరుకుని, కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని కలెక్టర్ వెల్లడించారు. అనంతరం సాయంత్రం 6 గంటలకు తిరిగి హైదరాబాద్‌కు బయలుదేరుతారని తెలిపారు.

ఓటు హక్కు పరిరక్షణకు 'ఛలో ఢిల్లీ'

ఢిల్లీకి బయలుదేరిన వరంగల్ డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్

వరంగల్ విజయ కెరటం,11:అక్టోబర్ :



"ప్రజాస్వామ్య పరిరక్షణకు, ఓటు హక్కుల రక్షణకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుంది" అని మహమ్మద్ అయూబ్ అన్నారు.ఏఐసీసీ పిలుపు మేరకు అక్టోబర్ 12న ఢిల్లీలో నిర్వహించనున్న 'ఛలో ఢిల్లీ' రాజ్యాంగ పరిరక్షణ యాత్రలో పాల్గొనేందుకు మహమ్మద్ అయూబ్ ఆదివారం ఢిల్లీకి బయలుదేరారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వ్యవహారశైలిని నిరసిస్తూ, ఓటు హక్కు పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ఈ కార్యక్రమాన్ని చేపట్టింది.ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను కాపాడటం, ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడం ఈ యాత్ర ప్రధాన లక్ష్యాలని పార్టీ పేర్కొంది. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ పిలుపు మేరకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్, రాష్ట్ర మంత్రులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొననున్నారు.ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడటం ప్రజాస్వామ్య పరిరక్షణలో కీలకమని కాంగ్రెస్ పార్టీ భావిస్తోందని, ఈ లక్ష్యంతో ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు మహమ్మద్ అయూబ్ తెలిపారు.

నల్గొండ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ హేమలతకు మంత్రి కోమటిరెడ్డి అభినందనలు

నల్గొండ, అక్టోబర్ 11 (విజయ కెరటం):



నల్గొండ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా నియమితులైన ముషంపల్లి గ్రామానికి చెందిన బైరెడ్డి హేమలత వెంకట్ రెడ్డితో పాటు పలువురు పాలకవర్గ సభ్యులను రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అభినందించారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో వారిని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన చైర్మన్, పాలకవర్గ సభ్యులకు ఆయన అభినందనలు తెలియజేశారు.

భద్రకాళి నగర్ 2లో ఘనంగా నవరాత్రి ఉత్సవాలు....

హన్మకొండ. విజయ కెరటం ప్రతినిధి. అక్టోబర్ 11...

భీమారం 55 వ డివిజన్ భద్రకాళి నగర్ 2లో నవరాత్రి ఉత్సవాల తొలిరోజు పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కలశ ప్రతిష్ఠ, అమ్మవారి విగ్రహ ప్రతిష్ట జరిగినట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నాగిళ్ళ వేణు శర్మ తెలిపారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.కార్యక్రమంలోకాలనీ అధ్యక్షుడు విజయకుమార్ మరియు మహిళలు కాలనీ సభ్యులు పాల్గొన్నారు.



బ్రేకింగ్ న్యూస్: మంటల్లో చిక్కుకున్న ఐదుగురిని కాపాడిన మిర్యాలగూడ పోలీసులు










మిర్యాలగూడ, అక్టోబర్ 11 (విజయ కెరటం):

నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని ఇస్లాంపుర ప్రాంతంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. చెప్పుల దుకాణం ఉన్న భవనంలో మంటలు చెలరేగడంతో పై అంతస్తుల్లో నివాసం ఉంటున్న కుటుంబ సభ్యులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. దట్టమైన పొగ వ్యాపించడంతో బయటకు రాలేక భవనంలోనే చిక్కుకుపోయారు.సమాచారం అందుకున్న మిర్యాలగూడ వన్‌టౌన్ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. సమయస్ఫూర్తితో స్పందించి భవనంలో చిక్కుకున్న ఐదుగురు కుటుంబ సభ్యులను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. మంటలను అదుపులోకి తీసుకురావడానికి కూడా చర్యలు చేపట్టారు.ప్రమాద సమయంలో వేగంగా స్పందించి ఐదుగురి ప్రాణాలను కాపాడిన మిర్యాలగూడ వన్‌టౌన్ పోలీసుల సేవలను పలువురు అభినందిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజల ప్రాణరక్షణకు పోలీసులు చూపిన చొరవ, అంకితభావం అభినందనీయమని పేర్కొంటున్నారు.

చాణిక్యపురి కాలనీలో బాలా త్రిపుర సుందరి అమ్మవారిని దర్శించుకున్న టీజీవో హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ యాదవ్

హైదరాబాద్, అక్టోబర్ 11 (విజయ కెరటం):





శక్తి సాయి నగర్ డివిజన్ పరిధిలోని మల్లాపూర్ చాణిక్యపురి కాలనీలో ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయంలో నవరాత్రుల సందర్భంగా శ్రీ బాలా త్రిపుర సుందరి అమ్మవారిని టీజీవో హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు మన్య బోయిన కృష్ణ యాదవ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. ప్రజలు, ఉద్యోగులు, అధికారులు, చాణిక్యపురి కాలనీ వాసులు అమ్మవారి ఆశీస్సులతో సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం మల్కాజ్‌గిరి జిల్లా మహిళా అధ్యక్షురాలు ఎంబీ శ్రీ దుర్గా మాధవి యాదవ్‌తో పాటు ఎం. గోపాల్ యాదవ్, ఎంబీ వినోద యాదవ్, ఎంబీ హేమలత యాదవ్, కాజా నాగమణి యాదవ్, ఎం. సత్యనారాయణ, పుష్పలత, జె. అశోక్ బాబు, వసంత యాదవ్, మారం మల్లికార్జున్ యాదవ్, ఉమా యాదవ్, రమేష్ యాదవ్, హేమలత యాదవ్, మంజుల యాదవ్, ప్రణీత యాదవ్, కల్పన యాదవ్, సతీష్ యాదవ్, మానస యాదవ్, శివ యాదవ్, మౌనిక యాదవ్, అజయ్, సంపూర్ణ యాదవ్, పునీత్ యాదవ్, ధనవి యాదవ్, రూల్ యాదవ్, కాజా సంధ్యారాణి యాదవ్, భార్గవ్ యాదవ్, వర్తిక యాదవ్, సునైనా యాదవ్ తదితరులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

గుండె పీదిలంగా ఉండాలంటే..

రాత్రి నిద్రకు ముందు పాలను తాగడం అనేది చాలా మందికి ఆరోగ్యకరమైన అలవాటు. అయితే ఈ పాలకు ఖర్జూరం కలిపితే మరిన్ని ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయి. పాలు, ఖర్జూరం రెండూ శరీరానికి అవసరమైన పోషకాలు కలిగి ఉంటాయి. వీటిని కలిపి తీసుకోవడం వల్ల శక్తి పెరుగుతుంది, ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఖర్జూరం సహజంగా శక్తివంతమైన పండు. దీనిలో విటమిన్-ఎ, బీ, జ లాంటి పోషకాలు, అలాగే ఐరన్, పొటాషియం, మాంగనీస్ వంటి మినరల్స్ అధికంగా ఉంటాయి. ఖర్జూరాన్ని కొంత సమయం నానబెట్టి తీసుకోవడం వల్ల ఈ పోషకాలు మరింత శక్తివంతంగా శరీరంలో చేరవచ్చు. ఇది మన రోగనిరోధక శక్తిని పెంచడంలో ఎంతో సహాయపడుతుంది. పాలు, ఖర్జూరం కలిపి తీసుకోవడం వల్ల ఎముకలు బలంగా మారతాయి. వయస్సు పెరిగే కొద్దీ ఎముకల బలహీనత, కీళ్ళ నొప్పులు వంటి సమస్యలు చాలా మందిలో కనిపిస్తాయి. అప్పుడు ఈ పాలు, ఖర్జూరం కలిపి తీసుకోవడం వల్ల శరీరానికి అవసరమైన పోషకాలను అందిస్తుంది. ఖర్జూరంలో ఉండే మాంగనీస్, కాల్షియం, ఫాస్ఫరస్ వంటి మూలకాలు ఎముకల పటుత్వాన్ని పెంచుతాయి. పాలు అందించే ప్రోటీన్, కాల్షియంతో కలిపి ఈ మూలకాలు ఎముకలకు కావలసిన బలాన్ని ఇస్తాయి.ఖర్జూరం, పాలు కలిసి చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. చర్మంపై ఎలర్జీలు, మంటలు, పొడిబారిన సమస్యలు ఉంటే.. ఈ పాలు, ఖర్జూరం కలిపి తీసుకోవడం వల్ల ఉపశమనం పొందవచ్చు. ఖర్జూరంలో ఉన్న యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి.. పాలు అందించే లాక్టిక్ ఆమ్లం చర్మాన్ని శుభ్రపరుస్తుంది. ఈ రెండు కలిపి తీసుకోవడం వల్ల చర్మం మెరుస్తుంది. పాలు, ఖర్జూరం కలిపి తీసుకోవడం వల్ల కండరాలు బలపడతాయి. ఈ రెండింటిలో ఉండే ప్రోటీన్ శరీరానికి అవసరమైన పోషకాన్ని అందించి కండరాల పునరుద్ధరణను వేగవంతం చేస్తుంది. ముఖ్యంగా శారీరక శ్రమ చేసిన తర్వాత పాలు, ఖర్జూరం కలిపి తీసుకోవడం వల్ల శరీరం కోల్పోయిన శక్తిని తిరిగి పొందుతుంది. పాలతో ఖర్జూరం తీసుకోవడం వలన రక్తప్రసరణ మెరుగుపడుతుంది. ఇది హృదయ ఆరోగ్యాన్ని కాపాడుతుంది. రక్తప్రసరణ పెరగడంతో శరీరంలోని అన్ని అవయవాలకు ఆక్సిజన్ సమర్థంగా అందుతుంది. దీని వల్ల శక్తి స్థాయి పెరుగుతూనే.. ముఖానికి సహజమైన కాంతి కూడా వస్తుంది. ఇలా పాలతో ఖర్జూరం కలిపి తాగడం ద్వారా శరీరానికి శక్తి, ఆరోగ్యం, అందం అందుతాయి.



Printed, Published Edited and Owned by MAKSOOD AHAMED MOHAMED,H.No. 5-8-222/1, Shams Nagar, BTS Nalgonda - 508 001 (Telangana State) Printed at Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA 508 001, (Telangana State), Published From: Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA - 508 001 (A.P.), Editor: MAKSOOD AHAMED MOHAMED Cell: 9908408528